క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



చింతపల్లి : మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన చెట్టి మళ్ల అంకిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద విద్యార్థిని అయిన అంకిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమని పలువురు అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కరుణాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సంబంధిత రికార్డులతో హాజరు కావాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

డిండి: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముదిగొండ ఏలేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని నీటి పారుదల శాఖ అతిథి గృహంలో దీక్షకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణబిల్లును ప్రవేశ పెట్టాలని ఆయన డిమాండ్ చేసారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేందర్, ఆనంద్, ఈశ్వర్, సైదులు, సాలయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి గురువారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం ప్రతి వార్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డిండి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 38 గ్రామపంచాయతీల్లో ప్రతి గురువారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి డానియల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామపంచాయితీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసే ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బారి శివలింగ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి బుధవారం శివలింగను పరామర్శించి, కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పందుల పెదసైదులు, లింగయ్య, రాములు, సింహాద్రి, రమణయ్య, నవీన్, నాగయ్య, సైదులు, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

దేవరకొండ : దేవరకొండ మండలం జిల్లేపల్లికి చెందిన నరసింహ 6నెలల క్రితం ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. నరసింహ కూతురు భూమిక హైదరాబాద్‌లో బీ–ఫార్మసీ చదువుతుంది. జిల్లేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంకేపల్లి యాదవేందర్‌రెడ్డి భూమిక చదువుకు అవసరమైన ఆర్థికసాయం అందించేందుకు ముందుకొచ్చారు. బుధవారం ఫస్ట్ టర్మ్ ఫీజు కింద రూ.40 వేలు కళాశాలలో అందించారు. కార్యక్రమంలో బెక్కరి కొండల్‌రెడ్డి, సంకేపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ధనరాజ్, నరేష్‌రెడ్డి, విష్ణు, లింగం, యాదయ్య ఉన్నారు.

చకిలం శ్రీనివాసరావుకు నివాళి

నల్లగొండ: బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన మహనీయుడు చకిలం శ్రీనివాసరావు అని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. మాజీ ఎంపీ చకిలం శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా నల్లగొండలో బుధవారం ఆయన విగ్రహానికి శంకర్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చకిలం అనిల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, సుభాష్, జూలకంటి సైదిరెడ్డి, పోలె జయకుమార్, గాలి నాగరాజు, గాలి రవి, మామిడి కార్తీక్, పాదం అనిల్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నల్లగొండ: పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో బుధవారం బాలికలకు మ్యాన్‌కైండ్ ఫార్మ ఆధ్వర్యంలో హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ రాజేశ్వరి హాజరై కౌమార దశలో బాలికలకు వచ్చే ఆరోగ్య సమస్యలపై వివరించారు. ముఖ్యంగా రక్తహీనత, రుతుక్రమం, గర్భసంచి క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- సమయానికి అందని అద్దె బిల్లులు



పెద్దవూర : ఏనేమీదితండాలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పెద్దవూర: ఐదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య నేర్పించాలన్న ప్రధాన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. పౌష్టికాహార లోపాన్ని నివారించాలనే సంకల్పంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ కేంద్రాల్లోనే ఒకపూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలను వెచ్చిస్తుంది. అయితే ఆ ఆశయాలు. లక్ష్యాలు బాగానే ఉన్నా ఇలాంటి కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవు. వీటికి సొంత భవనాల ఏర్పాటు విషయంలోనే అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేస్తామన్న పాలకుల మాటలు నీటి మీద రాతలే అవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రాజెక్టు పరిధిలో ఇలా..

గతంలో పెద్దవూర, నిడమనూరు, అనుముల, త్రిపురారం మండలాలకు కలిపి 1986వ సంవత్సరంలో పెద్దవూర ఐసీడీఎస్ ప్రాజెక్టును పెద్దవూరలో స్థాపించారు. ఆ తర్వాత మౌలిక వసతుల లేమితో పెద్దవూర ఐసీడీఎస్ ప్రాజెక్టును గత యేడాది అనుముల మండలం హాలియాకు మార్చారు. ప్రాజెక్టు పరిధిలో ప్రస్తుతం పెద్దవూర, అనుముల, నిడమనూరు, తిరుమలగిరి మండలాలు ఉన్నాయి. అనుముల ప్రాజెక్టు కింద పెద్దవూర మండలంలో 76 అంగన్‌వాడీ కేంద్రాలు, అనుముల మండలంలో 52, నిడమనూరులో 56, తిరుమలగిరి మండలంలో 71 అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి మొత్తం 255 కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి పరిధిలో 10 అంగన్‌వాడీ సెక్టారులను ఏర్పాటు చేశారు. ఒక్కో సెక్టారులో 20నుంచి 30 అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షణలో నడుస్తున్నాయి. వీనిలో ఏడు నెలల నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు 8,271 మంది, బాలింతలు 1096 మంది, గర్భిణులు 1252 మంది ఉన్నారు.

అద్దె భవనాల్లో సౌకర్యాలు కరువు

ప్రాజెక్టు పరిధిలో మొత్తం 255 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో పక్కా భవనాలు ఉన్నవి కేవలం 74 అంగన్‌వాడీ కేంద్రాలే. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నవి 90 కాగా, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌లు, గ్రామ పంచాయతీలలో నడుస్తున్నవి 91 కేంద్రాలు ఉన్నాయి. 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో అద్దె భవనాలలో మౌలిక వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న కిరాయి చాలా తక్కువగా ఉండటంతో అన్ని వసతులు ఉన్న ఇంటి యజమానులు అంగన్‌వాడీ కేంద్రాలకు కిరాయికి ఇవ్వటానికి ముందుకు రావడం లేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు బతిమాలి అరకొర వసతులు ఉన్న ఇంటిలో ఓ గదిని అద్దెకు తీసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఇంటి యజమానుల తమ సామగ్రిని కేంద్రంలోనే వేసుకుంటున్నారు. ఇవి చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఇంటి కిరాయిలను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయడం లేదని, దీంతో ఇంటి యజమానులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటివరకు ఇంటి అద్దె బకాయిలు ఆరు నెలలు ఉన్నాయని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గది విస్తీర్ణాన్ని బట్టి రూ.వెయ్యిలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.3 లోపు కిరాయిలు ఇస్తున్నారు. అదే మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.200లు ఇంటి అద్దె చెల్లిస్తున్నారు. దీంతో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలు



దేవరకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలు బుధవారం దేవరకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.కొండమల్లేపల్లి నుంచి దేవరకొండ వరకు పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పట్టణంలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ సిరాజ్‌ఖాన్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, నల్లగాసు జాన్‌యాదవ్, జాల నర్సింహారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు లోకసాని శ్రీధర్‌రెడ్డి, అంగిరేకుల నాగభూషణం, ఉట్కూరి వేమన్‌రెడ్డి, వీరబోయిన ఎల్లయ్య యాదవ్, నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, లోకసాని తిరుపతయ్య, జర్పుల బద్యానాయక్, ఎండి యూనూస్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాసింగ్ తదితరులున్నారు.

డిండి: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో బ్లాక్ దొంతినేని వెంకటేశ్వరరావు, నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, సాయికుమార్, భీముడు, దినేష్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్,సలయ్య, సాయిలు, ఉమర్, రహీం, ఖలీం, ప్రవీణ్, శ్రీను, కొండలు పాల్గొన్నారు.

చందంపేట : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చందంపేట, పోలేపల్లి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్యానాయక్, ఎంపీటీసీ మల్లయ్య, నజీర్, సాధిక్, గోసుల అనంతగిరి, మల్లారెడ్డి, పాలగోని వెంకట్‌గౌడ్, వంశీకృష్ణ, లచ్చిరాం, మహాలక్ష్మయ్య, మన్మథరెడ్డి, యుగేంధర్, సాయిరాథోడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, లింగంపల్లి వెంకటయ్య, హరి నాయక్, యాదగిరి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తా వద్ద ఎమ్మెల్యే బాలునాయక్‌కు గజ మాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, ఎల్లయ్య, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, కైసర్ ఖాన్, జగదీష్, గంధం సురేష్ పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై సలహాల స్వీకరణ



పెద్దవూరలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దవూర: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో జిల్లా వ్యవసాయ ఆడిట్ అధికారి గోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతు భరోసాపై పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైతుల అభిప్రాయాలు, సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ధీరావత్ థావ్, ఏఓ సందీప్, సీఈవో వెంకట్‌రెడ్డి, పబ్బు యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే 'రైతు భరోసా' ఇవ్వాలి

పెద్దఅడిశర్లపల్లి : సాగు చేసే భూములకే రైతు భరోసా ఇవ్వాలనిపెద్దఅడిశర్లపల్లి మండల రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో రైతు భరోసా ఏర్పాటు చేసిన ప్రత్యేక మహాజన సభలో రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశానికి సహకార సంఘం జిల్లా అధికారులు శ్రీనివాస్, అయూబ్, సహకార సంఘం చైర్మన్ తేర మణిపాల్‌రెడ్డి, ఏఓ పాండు నాయక్‌లు హాజరయ్యారు.

నేడు అన్ని వార్డుల్లో ప్రజావాణి



మాట్లాడుతున్న కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో గురువారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. బుధవారం స్థానిక చాంబర్స్‌లో జరిగిన వార్డు ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న రక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం ,రోడ్లు, సీజనల్ వ్యాధులపై వార్డు ఆఫీసర్లు ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ అజ్మీర కిరణ్ తదితరులున్నారు.

ఆస్పత్రికి వంద పడకలు కేటాయించాలి



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాళ్లు

దేవరకొండ: దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా మరో వంద పడకలు కేటాయించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా బుధవారం ఐద్వా కమిటీ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు.వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులతో వారు మాట్లాడి అక్కడి స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయయాలని, వైద్యులు సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, పద్మ, పుష్పలత, లక్ష్మి, రమణ, ఎల్లమ్మ, తదితరులున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : ఆర్యవైశ్య నేత, కాంగ్రెస్ నాయకుడు చకిలం శ్రీనివాస్‌రావు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వాసవీ మాత, గోవుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఐఈసీ ఆఫీసర్ తెడ్ల జవహర్‌బాబు, మిర్యాల శత్రయ్య, రేపాల శ్రీనివాస్, తమల్లయ్య, జనార్దన్, నీలా ఆనంద్, లకుమారపు రమేష్, లకుమారపు పాండురంగయ్య, గుండా నాగరాజు, శ్రీనివాస్, రామలింగయ్య, పరమేష్, రవి, వేణు, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్‌ను సన్మానిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి : ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అడవిదేవులపల్లి మండలానికి చెందిన ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలానికి చెందిన ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లేశ్వరీ, కోఆప్షన్ సభ్యులు బాబుజాన్‌లతో పాటు ఎంపీటీసీలందరికి సత్కరిస్తూ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈఓ మాలోతు బాలాజీనాయక్, ఎంపీఓ ఎండి మోహసిన్ బిన్ అహ్మద్, మండల వైద్యాధికారి సీహెచ్ ఉపేందర్, అమీర్ అలీ, వెంకట్‌రెడ్డి, సూర్యానాయక్, చిన్నినాయక్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధిగా గండు సుధాకర్



నియామక పత్రం అందుకుంటున్న సుధాకర్

పెద్దఅడిశర్లపల్లి : ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధిగా మండలంలోని అంగడిపేటకు చెందిన గండు సుధాకర్ ఎన్నికయ్యాడు. ఈ మేరకు బుధవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి పోతెం సహదేవుడు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర గిరి, సతీష్, సంజీవ, రవి,కొండల్, సాయి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దేవరకొండ: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ దేవరకొండ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ కోరారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లిలో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సముద్రాల ప్రభాకర్,చిలుకూరి నిరంజన్,వనం భిక్షమయ్య,రాజేష్, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులున్నారు.

యువతి అదృశ్యం

డిండి: యువతి అదృశ్యమైంది. ఈ ఘటన డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బిట్ల స్వాతి మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. స్వాతి ఫోన్ కూడా స్విచాఫ్ కావడంతో ఆమె తండ్రి సంజీవరెడ్డి బుధవారం డిండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న వీరన్ననాయక్

దేవరకొండ: కేంద్ర ప్రభుత్వం నీట్ స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో వినయ్, భాను, అరవింద్, వెంకటేష్, దేవేందర్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

పేపర్ లీకేజీలతో విద్యార్థులకు నష్టం

మిర్యాలగూడ: కేంద్రం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నిర్వహించే దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్ననాయక్ కోరారు. బుధవారం ఆయన దామరచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో పేపర్ లీకేజీలు, స్కామ్‌లు, పరీక్షల రద్దు వంటి నిర్ణయాలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విష్ణు, సాగర్, రాహుల్, మణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నష్టపరిహం అందించాలి

వేములపల్లి : నీట్‌ను రద్దు చేయడం వల్ల నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం అందించడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పతాని శ్రీను, జగన్, పుట్ట సంపత్‌లు కోరారు. బుధవారం వారు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఫీజు దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లోకేష్, గోపి, కృష్ణ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : నీట్ మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 4న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కొండమల్లేపల్లి లోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చరన్, ఇద్దిరాములు, రాకేష్, శాంతి, గణేష్, ఆంజనేయులు, మంజుల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : విద్యా రంగ సమస్యల పరిష్కారానికి గురువారం నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను విజవయంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంసొద్దీన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకున్న ఫీజును వెనక్కి ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు శివ, ఎండి.జావిద్ పాల్గొన్నారు.

నీట్ స్కాంపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ అర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం గురువారం చేపట్టబోయో విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైదానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ స్కాంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వదూద్, పతాని శ్రీను, జనగ్, సుమాన్, సంపత్, నగేష్, బాబు, కిరణ్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ధనావత్ భారతి

త్రిపురారం : గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీటీసీ ధనావత్ భారతి పేర్కొన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.20 లక్షలతో మండలంలోని వస్త్రాం తండాలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డిల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపగాని మాధవి, మైలారుషెట్టి సైదయ్య, ధనావత్ భాస్కర్ నాయక్, బిట్టు రవి కుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బుధవారం మున్సిల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీలో మురుగు కాలువలు, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, పందిర అనిత, గంధం రామకృష్ణ, జాని, జావీద్, మెయిజ్, గోదాల జానకి రాంరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

మిర్యాలగూడ అర్బన్: రెండు లక్షల ఉద్యోగాలు తక్షణమే భర్తీ చేసి జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ డిమాండ్ చేశారు. మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన యువజన సర్వేలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. సమాజంలో యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్, కుమార్, శ్రీను, రవి, వినోద్, మోహన్ పాల్గొన్నారు.

బాలికలను చదువులో ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సక్కుబాయి

కొండమల్లేపల్లి : బాలికలను చదువులో ప్రోత్సహించాలని జిల్లా మహిళా సంక్షేమ అధికారి సక్కుబాయి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. బేటీ పడావో.. బేటీ బచావో తదితర కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉదయశ్రీ, ఏసీడీపీఓ సరళ, అదనపు వేణు, గణేశ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రెబక, సునిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాడిన అన్నం.. నీళ్ల చారు !

- కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు నాసిరకం భోజనం
- తినలేక అవస్థలు పడుతున్న విద్యార్థినులు



విద్యార్థినులకు వడ్డించిన మాడిపోయిన అన్నం

వేములపల్లి : మాడిన అన్నం.. నీళ్ల చారు.. ఇదీ కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనం. నాసిరకం భోజనం తినలేక విద్యార్థినులు పడుతున్న అవస్థలు బుధవారం 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూశాయి. వేములపల్లి మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 444 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. వీరికి ఆహారం అందించేందుకు ఐదుగురు వంట సిబ్బందిని నియమించారు. మెనూ పాటించకుండా ఆహారం అందిస్తున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పనీయకుండా భయపెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాడిపోయి ముద్దలుగా ఉన్న అన్నం వండిపెడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు మెనూ పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.